సాక్షి అనకాపల్లి

గురువారం । 15 । ఫిబ్రవరి । 2024



ఎరుకుమాంబకు జలాభిషేకం

విశాఖ: దొండపర్తిలోని ఎరుకుమాంబ అమ్మ వారికి బుధవారం భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం చేశారు.



చదువులమ్మకు వందనం

అనకాపల్లి: వసంత పంచమి సందర్భంగా విద్యార్థులు సరస్వతీ మాతకు పూజలు చేశారు. చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించారు.



రైతుల శ్రేయస్సే లక్ష్యం!

విశాఖ: రైతులకు తోడ్పాటు అందించేలా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. 8లో

న్యూస్‌రీల్

ఏరియా ఆస్పత్రి నూతన బ్లాక్‌కు వైఎస్సార్ పేరు

సాక్షి, అనకాపల్లి: నర్సీపట్నం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నూతనంగా నిర్మించిన ఓపీడీ బ్లాక్‌కు 'వైఎస్సార్ భవన్' అని నామకరణం చేశారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ ఎం.టి.కృష్ణబాబు బుధవారం హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లకు పంపించారు. ఏపీ వైద్యవిధాన పరిషత్ డెవలప్‌మెంట్ నిధులు రూ.9 కోట్లతో ఓపీడీ బ్లాక్ నిర్మించారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



వాహనదారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

అనకాపల్లి: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని రవాణా శాఖ అధికారి కె.వి.ప్రకాష్ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో బుధవారం వాహన, ఆటో కార్మికులకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆటో డ్రైవర్లు ముందు సీట్లో ప్రయాణికులను కూర్చోపెట్టరాదని సూచించారు. ఆటోల ఫిట్‌నెస్ ఏమాత్రం తగ్గినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ శ్రీను, ఎస్ఐ రమేష్, వాహనచోదకులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షలో ఎంపీ సేవలు



అనకాపల్లి ఉడ్‌పేట ప్రాథమిక పాఠశాలలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి పాల్గొన్నారు. వృద్ధురాలిని పరీక్షించారు.

- తుమ్మపాల

మిలాన్-2024 పై సీపీ సమీక్ష



నేవీ, పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశంలో పాల్గొన్న సీపీ డాక్టర్ రవిశంకర్

అల్లిపురం: ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు రెండు ఫేజ్‌లుగా బీచ్‌రోడ్డులో నిర్వహిస్తున్న మిలాన్–2024పై నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఏ.రవిశంకర్ బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సూర్యాబాగ్‌లోని పోలీస్ కమిషనరేట్‌లో జరిగిన సమావేశంలో మిలాన్–2024 సందర్భంగా నగరానికి ఉపరాష్ట్రపతి, కేంద్ర రక్షణ శాఖ మంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు పలువురు వీఐపీలు, వీవీఐపీలు వచ్చే అవకాశం ఉన్నందున భద్రతపై చర్చించారు. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న మిలాన్–2024ను విజయవంతం చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ సీపీ కె.ఫకీరప్ప, డీసీపీ –1 మీఎస్ మణికంఠ చందోల్, డీసీపీ క్రైం పి.వెంకటరత్నం, నేవీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

16న మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్) తెలిపారు. అరబిందో స్పైసెస్, జాబ్ డీలర్స్, రాయల్ ఎన్ ఫీల్డ్, సాయి కెమికల్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, హరీష్ ఫుడ్ బేవరేజెస్, హెటిరో డ్రగ్స్ శ్రీరామ ఫైనాన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 555 ఉద్యోగాలు భర్తీ చేయనున్నారు. సర్వీస్ అడ్వైజర్ టెక్నీషియన్, జూనియర్ కెమిస్ట్, రిటైల్ ట్రెనింగ్ అసోసియేట్, ఫార్మసిస్ట్, జూనియర్ ట్రెనీ, డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, ఆఫీస్ అసిస్టెంట్, అకౌంట్స్, అసిస్టెంట్, రికవరీ క్లర్కు, బ్రాంచ్ ఇంచార్జ్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పీజీ, ఎం.ఫార్మసీ ఉత్తీర్ణత సాధించిన 18–42 సంవత్సరాల వయసు కల్గిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా ఉద్యోగాల బట్టి జీతం నెలకు రూ10 వేలు నుంచి రూ.18,500ల వరకు ఉంటుందన్నారు. కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం 10 గంటలకు జాబ్‌మేళాకు హాజరుకావాలని ఆయన కోరారు.

సంకల్పం ఉంటే సాధించలేనిది లేదు. ప్రజల బాధలు తీర్చాలని ప్రభుత్వం గట్టిగా అనుకుంటే ఏదో ఒక మార్గం దొరుకుతుంది. అందుకు ఉదాహరణే కొక్కిరాపల్లి రైల్వే గేటు పై ఓవర్ వంతెన. దాదాపు పదిహేనేళ్లుగా నలుగుతూ.. ప్రజలు ఇక తమ సమస్య తీరదని అనుకుంటున్న దశలో ప్రజాప్రతినిధుల పూనికతో చిరకాల వాంఛ నెరవేరే శుభ తరుణం ఆసన్నమైంది.

శుభ సంకల్పం



తుది దశకు చేరుకున్న పై ఓవర్ బ్రిడ్జి

- కొలిక్కివచ్చిన కొక్కిరాపల్లి రైల్వే పై ఓవర్
- నెరవేరుతున్న యలమంచిలి ప్రజల చిరకాల స్వప్నం
- తుది దశకు నిర్మాణ పనులు.. ఈనెల 22న ప్రారంభోత్సవం
- వంతెన పనులను అసంపూర్తిగా వదిలి పెట్టిన టీడీపీ ప్రభుత్వం
- 15 ఏళ్ల తర్వాత వంతెన పనులను పూర్తి చేయిస్తున్న వైఎస్సార్‌సీపీ సర్కారు



కొక్కిరాపల్లి రైల్వే గేటు వద్ద నిలిచిన ట్రాఫిక్ (ఫైల్)



తుది మెరుగులు దిద్దుకుంటున్న వంతెన



బుధవారం సాయంత్రం పై ఓవర్ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

యలమంచిలి రూరల్: పట్టణ ప్రజల సుందర స్వప్నం.. కొక్కిరాపల్లి రైల్వే గేటు పై ఓవర్ వంతెన మరో వారం రోజుల్లో సాకారం కానుంది. ఈ వంతెన నిర్మాణానికి 2009 ఫిబ్రవరి 15వ తేదీన శంకుస్థాపన చేశారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అకాల మరణంతో ఈ ప్రాజెక్టు ముందుకు సాగలేదు. రూ.35 కోట్లతో ప్రతిపాదించిన ఈ వంతెన పనులను కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు పూర్తిచేయలేదు.

కొక్కిరాపల్లి రైల్వే గేటు వద్ద గంటల తరబడి వాహనచోదకులు ఎన్నో ఇబ్బందులనెదుర్కొంటున్నా గత ప్రభుత్వ ప్రజాప్రతినిధులకు అవేమీ పట్టలేదు. ఫలితంగా ఇన్నాళ్లూ పట్టణ, పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే కన్నబాబురాజు పై ఓవర్ స్థితిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పనులు చేసిన కాంట్రాక్టర్‌కు బకాయి పెట్టిన సుమారు రూ.2 కోట్లను కూడా ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే చెల్లించింది. ఆ సొమ్ము తీసుకున్న కాంట్రాక్టర్ గత చేదు అనుభవంతో పనులు చేయడానికి ముందుకు రాలేదు. దీంతో మళ్లీ మిగులు పనులకు తాజా టెండర్లు పిలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాంకేతిక కారణాలతో ఆ ప్రక్రియలో కొంత జాప్యం చోటుచేసుకోవడంతో వంతెన పనులు ఇప్పట్లో పూర్తయ్యేలా లేవని పట్టణ ప్రజలు భావించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకున్న ఎమ్మెల్యే కన్నబాబు పట్టుదలతో ఎలాగైనా వంతెన పనులు పూర్తి చేయించాలని ప్రతినబూనారు. రూ.7,76,40,000 వ్యయంతో వంతెన మిగులు పనులు పూర్తి చేసేందుకు 2022 అక్టోబరు 27వ తేదీన విశాఖకు చెందిన వర్ధమాన్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ముందుకు వచ్చింది. అప్పట్నుంచి వంతెన పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

ఎమ్మెల్యే కన్నబాబు రోజువారీ పర్యవేక్షణ

వంతెన నిర్మాణం మధ్యలో నిలిచిపోవడంతో యలమంచిలి పట్టణం, పరిసర గ్రామాల ప్రజలు, పట్టణం మీదుగా 16వ నెంబరు జాతీయ రహదారికి రాకపోకలు సాగించే వాహన చోదకులు, ప్రయాణికులు కొక్కిరాపల్లి రైల్వే గేటు వద్ద ఇబ్బందులు పడేవారు.ఒక్కోసారి రెండు నుంచి నాలుగు రైళ్లు వెళ్లే వరకు రైల్వేగేటు వద్ద వాహనాలు నిలిచిపోవాల్సిన పరిస్థితి ఉండేది. అత్యవసర వైద్య చికిత్సలు, ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులను తీసుకెళ్లే అంబులెన్సులు కూడా గేటు వద్ద నిలిచిపోయి ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా లేకపోలేదు. ఈ మొత్తం పరిస్థితిని గమనించిన యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు ప్రత్యేక చొరవ తీసుకుని సాంకేతిక సమస్యలను పరిష్కరించడంతోపాటు నిర్మాణ పనులను వేగవంతం చేసేలా చూశారు. నిర్మాణ పనుల బాధ్యతలు చూస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టరుతో నిరంతరం పర్యవేక్షిస్తూ పనులు కొలిక్కి వచ్చేలా చూశారు. పనులు తుది దశకు చేరుకున్న సమయంలో పనులు చేస్తున్న కాంట్రాక్టరుకు ఆర్థిక కష్టాలు ఎదురుకావడంతో పనులు మళ్లీ నిలిచిపోయాయి. దీంతో ఎమ్మెల్యే కన్నబాబు కాంట్రాక్టరుకు ఆర్థిక చేయూతనిచ్చి వంతెన పనులు పూర్తి చేయిస్తున్నారు. ఎమ్మెల్యే రోజువారీ పర్యవేక్షణతో ప్రస్తుతం పై వంతెన పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఈ నెల 22న రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజాతో వంతెనకు ప్రారంభోత్సవం చేయించడానికి సన్నాహాలు చురుగ్గా జరుగుతున్నాయి.

ఇదీ వంతెన స్వరూపం

పొడవు	: 1.2 కిలోమీటర్లు
వరుసలు (లేన్లు)	: 2
పిల్లర్లు	: 38
ఎక్కడి నుంచి	: విపత్తుల నిర్వహణ శాఖ కార్యాలయం
ఎక్కడి వరకు	: 16వ జాతీయ రహదారి కొక్కిరాపల్లి వై జంక్షన్
వెచ్చించే నిధులు	: రూ.36 కోట్లు (రైల్వే శాఖ నిధులు కాకుండా)

వంతెన వినియోగంలోకి తేవడమే నా ఆశయం



కొక్కిరాపల్లి రైల్వే గేటు వద్ద ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు నేను కూడా ప్రత్యక్షంగా అనుభవించాను. పట్టణంలోకి వచ్చినప్పుడల్లా గేటు మూతపడినపుడు విలువైన సమయం వృథా అయ్యేది. ఇలా చాలామంది ప్రజలు ఇక్కడ వంతెన పూర్తి కాకపోవడం వలన అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని నియోజకవర్గ ఎమ్మెల్యేగా వంతెనను ఎలాగైనా వినియోగంలోకి తేవాలని అనుకున్నాను. ఎట్టి పరిస్థితుల్లోనూ వారం రోజుల్లో వంతెన పనులు పూర్తి చేసి వినియోగంలోకి తెస్తాం. 2014 ఎన్నికల ముందు.. గెలిస్తే ఏడాదిలోగా వంతెన పనులు పూర్తిచేయిస్తామని టీడీపీ నాయకులు హామీ ఇచ్చి, గెలిచిన తర్వాత ఆ విషయాన్ని మర్చిపోయారు. గత ఎన్నికల ముందు ప్రకటించిన విధంగానే వంతెన నేను పనులు పూర్తి చేయిస్తున్నాను. మాది చేతల ప్రభుత్వం.

-యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు), యలమంచిలి ఎమ్మెల్యే

సంక్షేమం, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



సమావేశానికి హాజరైన జెడ్పీటీసీలు, సభ్యులు

- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

మహారాణిపేట (విశాఖ): ప్రజాసంక్షేమం, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆదేశించారు. జెడ్పీ సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన బుధవారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ కార్యాలయాలకు, ఆస్పత్రులకు వచ్చే ప్రజలను గౌరవిస్తూ పారదర్శకంగా సేవలు అందించాలని ఆమె సూచించారు. జల్‌జీవన్ మిషన్ పనులను సక్రమంగా నిర్వహించాలని, సత్ఫలితాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారవర్గాలను ఆదేశించారు. పనుల ప్రగతి వివరాలను గ్రామ పరిధిలోని నోటీసు బోర్డుల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లు పేదల పిల్లలకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని, దీనిపై విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. గ్రంథాలయాలకు చెల్లించాల్సిన సెస్సు చార్జీలను త్వరితగతిన చెల్లించాలని ఆయా శాఖల అధికారులకు జెడ్పీ చైర్‌పర్సన్ సూచించారు. అనంతరం సభ్యులు సమావేశం దృష్టికి పలు సమస్యలు తీసుకువచ్చారు. జల్‌జీవన్ మిషన్‌లో చేపట్టిన పనులు నిరుపయోగంగా ఉన్నాయని వారు ధ్వజమెత్తారు. పనులు జరిగిన గ్రామాల్లో తాగునీరు పూర్తిస్థాయిలో అందించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుళాయిల ఏర్పాటుకు లబ్ధిదారుల నుంచి నగదు వసూలు చేస్తున్నారని గొలుగొండ జెడ్పీటీసీ సుర్ల వెంకట గిరిబాబు తెలిపారు. పక్కా గృహాల మంజూరులో అధికారుల తీరు సక్రమంగా లేదని జెడ్పీటీసీ సభ్యులు దొండా రాంబాబు, సుర్ల వెంకట గిరిబాబు, పైలా సన్యాసిరాజు ఆవేదన వ్యక్తం చేశారు. అనకాపల్లి ఆస్పత్రిలో పోస్టుమార్టానికి మృతుల కుటుంబ సభ్యుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని , దీనిపై విచారణ చేయాలని సభ్యులు కోరారు. మన్యం ప్రాంతాల్లో రోగులను విజయనగరం కాకుండా విశాఖ తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు సేవలను గుర్తించి రాజ్యసభ టిక్కెట్ కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతూ సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేశారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ , జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జెడ్పీ సీఈవో సీఈవో ఎం.పోలినాయుడు, అనకాపల్లి జిల్లా డీఆర్వో దయానిధి పాల్గొన్నారు.

మిల్లెట్స్ పానీపూరీ





మిల్లెట్స్, చెరకురసంతో పానీపూరీ తయారీలో విద్యార్థినులు

- ఆర్‌ఏఆర్‌ఎస్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినుల తయారీ
- భలే రుచి.. చక్కని ఆరోగ్యం

అనకాపల్లి: రోడ్డుకు ఇరువైపులా అమ్మకానికి ఉంచిన పానీపూరీ మిమ్మల్ని ఊరిస్తోందా.. అనారోగ్యానికి దారి తీస్తుందన్న భయం వెనక్కులాగుతోందా.. 'ఏం భయం లేదు.. ఇష్టమొచ్చినన్ని లాగించండి..' అంటున్నారు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ఏఆర్ఎస్) పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు. వీరు బుధవారం మిల్లెట్స్(చిరుధాన్యాలు)తో కూడిన పానీపూరీని తయారు చేశారు. ఈ సందర్భంగా వారు దాని ప్రత్యేకతలను వివరించారు. మిల్లెట్స్‌తో చేసిన పానీపూరీని తీసుకోవడం ద్వారా సుగర్, పలు దీర్ఘకాలిక వ్యాధులను దూరం చేయవచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వం 2023ను మిల్లెట్స్ ఇయర్‌గా ప్రకటించిన విషయం గుర్తు చేశారు. రోడ్లపై అమ్మకానికి ఉంచిన పానీపూరీలను 90 శాతం మైదా, 10 శాతం గోధుమతో తయారు చేస్తారని, వీటిని భుజించేవారిలో మధుమేహం వ్యాధి పెరగవచ్చన్నారు. 25 శాతం కొర్రలు, 25 శాతం చోడి పిండి, 15 శాతం మైదా, 30 శాతం ఉప్మా రవ్వతో తయారైన పానీపూరీలో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని, అంతేకాకుండా వ్యాధినిరోధకశక్తి పెంచుకోవచ్చని సూచించారు. తాము తయారు చేసే పానీపూరీలో చెరకురసం వాడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఏఆర్ఎస్ ఏడీఆర్ పి.వి.కె.జగన్నాథరావు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ వేణుగోపాలరావు పాల్గొన్నారు.

తాండవ గేట్ల మరమ్మతులకు రూ.10 లక్షలు మంజూరు

- రూ.30 లక్షలతో పూడికతీత పనులు
- ఇరిగేషన్ ఈఈ స్వామినాయుడు



నాతవరం: తాండవ రిజర్వాయర్ ప్రధాన గేట్ల మరమ్మతులకు ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేసిందని, త్వరలో టెండర్లు పిలుస్తామని ఇరిగేషన్ ఈఈ స్వామినాయుడు తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గేట్ల నుంచి నీరు లీకేజీ అవుతోందని, దానిని అరికట్టేందుకు మరమ్మతులు చేయనున్నట్టు చెప్పారు. ఈఏడాది వర్షాలు తక్కువగా కురవడం వల్ల తాండవ ప్రాజెక్టులో నీటి మట్టం గణనీయంగా తగ్గిపోయిందన్నారు. గేట్లకు మరమ్మతులు చేయడానికి ఇది అనుకూల సమయమని చెప్పారు. తాండవ కాలువలో పూడిక తొలగించేందుకు ప్రభుత్వం రూ.30 లక్షలు మంజూరు చేసిందన్నారు. ఆ నిధులతో పూడిక తొలగించడంతో పాటు కాలువకు స్వల్ప మరమ్మతులు చేస్తామని చెప్పారు. ఈ పనులు మార్చి నెలాఖరున ప్రారంభించి ఏప్రిల్, మే నెలల్లో పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో తాండవ నీటిని శివారు ఆయకట్టుకు అందించేందుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా పూడిక తొలగిస్తామన్నారు.

నక్కపల్లి క్లస్టర్లో పారిశ్రామిక అభివృద్ధి

- రూ.331.8 కోట్లతో 1120 ఎకరాల్లో స్టార్టప్ ఏరియా అభివృద్ధి
- వర్చువల్‌గా ప్రారంభించిన మంత్రి అమర్‌నాథ్



నక్కపల్లి పారిశ్రామిక ప్రాజెక్టు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, అధికారులు, నాయకులు

తుమ్మపాల: జిల్లాలో నక్కపల్లి పారిశ్రామిక క్లస్టర్ స్టార్–అప్ ప్రాంతంలో భారీ, మౌలిక వసతులు, యుటిలిటీస్ కల్పనతో పారిశ్రామిక అభివృద్ధికి చక్కని అవకాశం ఏర్పడిందని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి చెప్పారు. తాడేపల్లిలోని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పలు ప్రాజెక్టులను ప్రారంభించారు. అందులో నక్కపల్లి క్లస్టర్‌లో రూ.331 కోట్ల 80 లక్షలతో 1120 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్న స్టార్టప్ ఏరియా కూడా ఉంది. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్టార్టప్ ఏరియాను బి.వి.ఎస్.ఆర్.గారిసన్ (జేవీ) హైదరాబాద్ కంపెనీ ద్వారా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఈ క్లస్టర్లో 44 కిలోమీటర్ల రోడ్లు, పెద్ద కాలువలు, బ్రిడ్జిలు, విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పరవాడలో రూ.250 కోట్లతో విసు వి.ఎస్.రిఫ్రాక్టరీ పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 21.8 ఎకరాల్లో ఉండే ఈ పరిశ్రమ ద్వారా 500 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. అంతకుముందు ప్రాజెక్టు శిలాఫలకాన్ని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆవిష్కరించారు. జిల్లా పరిశ్రమల అధికారి జి.ఎం.శ్రీధర్, ఏపీఐఐసీ జెడ్‌ఎం త్రినాథ్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జెడ్పీటీసీ కాసులమ్మ, ఎంపీపీ రత్నం, సర్పంచ్ రోహిణి, ఎంపీటీసీ తిరుపతిరావు, అధికారులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు దామోదరం సంజీవయ్య



సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ



సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నమస్కరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య చిరస్మరణీయులని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. సంజీవయ్య జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో బుధవారం ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో 1921లో జన్మించిన సంజీవయ్య ఉమ్మడి రాష్ట్రానికి రెండో ముఖ్యమంత్రిగా, తొలి దళిత ముఖ్యమంత్రి గా సేవలందించారన్నారు. కేంద్ర మంత్రిగా, రాష్ట్ర మంత్రిగా కూడా విశిష్ట సేవలను అందించారన్నారు. నిరుపేద దళిత కుటుంబంలో జన్మించిన దామోదరం సంజీవయ్య నిరాడంబరతకు మారుపేరుగా నిజాయితీకి నిలువుటద్దంగా నిలిచార న్నా రు.జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ అజయ్‌బాబు, గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి మంజులవాణి, డీఎల్‌డీవో ఉదయశ్రీ, పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

అనకాపల్లి: అతి పిన్నివయస్సులో 38 ఏళ్లకే కేంద్రం ప్రభుత్వంలో మంత్రి పదవిని అలంకరించిన ఘనత దామోదరం సంజీవయ్యకే దక్కుతుందని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అన్నారు. ఎస్పీ కార్యాలయంలో బుధవారం సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదనపు ఎస్పీ బి.విజయ్‌భాస్కర్, అదనపు క్రైం ఎస్పీ పి.సత్యనారాయణరావు, డీటీసీ డీఎస్పీ డి.రామవర్మ, ఏవో బి.శారద తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై 16న రథసప్తమి వేడుకలు

సింహాచలం: లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఈ నెల 16న రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. మంగళశాసనం తరువాత ఉదయం 7 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తులను ప్రధాన దేవాలయ ప్రకారంలోని రాతి రథం మీదకు తీసుకువచ్చి విశేష అభిషేకాలు చేస్తామన్నారు. అనంతరం నిత్యం కల్యాణం 10 గంటలకు జరుగుతుందన్నారు. 12.30 నుంచి భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తామని చెప్పారు. సాయంత్రం 5 గంటల నుంచి స్వామివారి తిరువీధి ఉత్సవం జరుగుతుందని వివరించారు. కృష్ణాపురం గోశాలలో నిర్మించిన సూర్యభగవానుడి విగ్రహం వద్ద రథసప్తమి వేడుకలు ఉదయం 8 నుంచి ప్రారంభమవుతాయని ఈవో పేర్కొన్నారు.

అధ్యాపకులు కొట్టడం వల్లే మనస్తాపంతో వంశీ మృతి

- నారాయణ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న వంశీ కుటుంబ సభ్యులు, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు

తుమ్మపాల: అధ్యాపకులు కొట్టడం వల్లే మనస్తాపంతో మచ్చకర్ల వంశీ ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపిస్తూ వంశీ కుటుంబసభ్యులతో పాటు ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు కళాశాల వద్ద బుధవారం ఆందోళన చేశారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని నారాయణ కళాశాలకు వంశీ కుటుంబ సభ్యులు చేరుకుని బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న వంశీ ఈనెల 12న కళాశాలకు వచ్చాడని, ఇద్దరు అధ్యాపకులు కొట్టడంతో మిగిలిన విద్యార్థుల దగ్గర చులకనవుతానని మనస్తానికి గురై బుచ్చెయ్య పేట మండలం చిట్టయ్యపాలెంలో గల తన ఇంటికి వెళ్లి ఉరి వేసుకున్నట్టు తెలిపారు. కళాశాలలో జరిగిన ఘటన గురించి కళాశాల యాజమాన్యం తల్లిదండ్రులకు తెలియజేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షకార్యదర్శులు మామిడి రమణ, ఎస్.రమణ, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.శివాజీ, ఉపాధ్యక్షుడు బాలాజీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

17న వెంకన్న తలనీలాలు, కొబ్బరి చెక్కలకు వేలం

బుచ్చెయ్యపేట: వడ్డాది వేంకటేశ్వరస్వామి తలనీలాలు, కొబ్బరి చెక్కలకు ఈ నెల 17వ తేదీన వేలం పాట నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ ఈవో శర్మ బుధవారం తెలిపారు. వచ్చే నెల 20 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే స్వామివారి 151వ కల్యాణ ఉత్సవాల్లో భాగంగా వచ్చే కొబ్బరి చెక్కలు, ఈ ఏడాది మార్చి ఒకటి నుంచి 2025 ఫిబ్రవరి 28వ తేదీ వరకు స్వామివారికి సమర్పించే తలనీలాలు దక్కించుకునేందుకు వేలం నిర్వహిస్తున్నామన్నారు. వేలంలో పాల్గొనేవారు కార్యనిర్వహణాధికారి వేంకటేశ్వరస్వామి వడ్డాది పేరుపై రూ.5 వేలు డీడీ తీసి శుక్రవారం సాయంత్రం 5 గంటల్లోగా టెండర్ బాక్స్‌లో వేయాలని సూచించారు.

ప్రమాదంలో గాయపడిన వివాహిత మృతి

మాడుగుల: మండలంలో తాటిపర్తి గ్రామ శివారు కాశీపురం గ్రామానికి చెందిన వివాహిత అల్లంగి లక్ష్మి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్‌ఐ పి. దామోదర్‌నాయుడు బుధవారం సాయంత్రం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... ఈ నెల 9వ తేదీ రాత్రి లక్ష్మిపై అదే గ్రామానికి చెందిన అల్లంగి చిన్నమ్మలు పెట్రోల్ పోసి నిప్పంటించిన విషయం విదితమే. తన భర్త పోతురాజుతో లక్ష్మికి వివాహేతర సంబంధం ఉందని అనుమానంతో చిన్నమ్మలు ఈ ఘాతుకానికి పాల్పడింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైతుల శ్రేయస్సే లక్ష్యం.!

- నేడు డీసీసీబీ మహాజన సభ
- 2024-25 వార్షిక బడ్జెట్‌పై చర్చ
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 30 బ్రాంచీల ద్వారా కార్యకలాపాలు
- మరో 13 కొత్త బ్రాంచిల ఏర్పాటుకు కసరత్తు



విశాఖ మర్రిపాలెంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయం

విశాఖ విద్య: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్న నేపథ్యంలో రైతులకు తోడ్పాటు అందించేలా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) పక్కా ప్రణాళికతో ముందుకెళ్లోంది. రైతుల శ్రేయస్సే ప్రధాన అజెండాతో గురువారం జరగనున్న మహాజన సభలో 2024-25 వార్షిక బడ్జెట్‌పై చర్చించనున్నారు. నగరంలోని మర్రిపాలెంలో ఉన్న డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు బ్యాంక్ చైర్‌పర్సన్ కోలా గురువులు అధ్యక్షతన మహాజన సభ నిర్వహించేందుకు బ్యాంకు అధికారులు అంతా సిద్ధం చేశారు.

తక్కువ వడ్డీకే రుణాలు

- డిసెంబర్ మాసాంతం వరకు బ్యాంకులో అన్ని రకాల డిపాజిట్లు కలిపి రూ.883.94 కోట్లు ఉన్నాయి. ప్రభుత్వం, నాబార్డు నిర్దేశించిన వడ్డీ రేటుకు అనుగుణంగా ప్రాధాన్యత రంగాలకు రుణాలు మంజూరు చేస్తున్నారు.
- 2023-24 సంవత్సరంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు 20,005 మంది సభ్యులకు పంట రుణాల రూపేణా రూ.127.68 కోట్లు, అదే విధంగా అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు 7,694 మందికి రూ.53.72 లక్షలు ఇచ్చారు.
- వ్యవసాయ యాంత్రీకరణకు తోడ్పాటు అందించేలా కస్టమ్ హైరింగ్ కేంద్రాల(సీహెచ్‌సీ)కు ఈ ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ మాసాంతం వరకు 208 గ్రూపులకు రూ.4.56 కోట్లు మంజూరు చేశారు.
- స్వయం సహాయక సంఘాల బలోపేతం కోసమని బ్యాంకు ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ మాసాంతం వరకు 724 గ్రూపులకు రూ.39.13 కోట్లు రుణాలు మంజూరు చేశారు.
- బ్యాంకు ద్వారా సేవలు పొందుతున్న సభ్యుల్లో 75,757 మంది రైతులకు కిసాన్ రూపే కార్డులు జారీ చేశారు.

కొత్త బ్రాంచీలతో వ్యాపార విస్తరణ

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని 30 బ్రాంచీలు, వాటి పరిధిలోని 98 వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా కార్యకలాపాలు కొనసాగిస్తోంది. బ్యాంకు అభివృద్ధిలో భాగంగా కొత్త బ్రాంచీల ఏర్పాటుపై అధికారులు దృష్టి సారించారు. విశాఖ జిల్లాలో 2, అనకాపల్లిలో 9, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 2 బ్రాంచీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. విశాఖ జిల్లాలోని పద్మనాభం, ఆనందపురంలో బ్రాంచీల ఏర్పాటుకు రిజర్వ్ బ్యాంకు నుంచి ఇప్పటికే అనుమతులు వచ్చాయి. వీటిని త్వరలోనే ప్రారంభించేలా బ్యాంకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

బ్యాంకుల కంప్యూటరీకరణ

డీసీసీబీ ఆధ్వర్యంలో అవసరమైన చోట్ల ఏటీఎం కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్ర సహకార మంత్రిత్వశాఖ సూచనలకు అనుగుణంగా కంప్యూటరీకరణ, సైబర్ సెక్యూరిటీ, భవిష్యత్ అవసరాల మేరకు డేటా స్టోరేజీలో భాగంగా అంతా డిజిటలైజేషన్ చేస్తున్నారు. ఇందు కోసం ఒక్కో బ్రాంచికి రూ.3.91 లక్షల ఖర్చుతో డిజిటిలైజేషన్ పనులు చేపట్టారు.

అందరి సమన్వయంతో అభివృద్ధి



ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా రైతులకు తోడ్పాటు అందిస్తూనే, బ్యాంకు అభివృద్ధి కోసమని వ్యాపార విస్తరణపై దృష్టి పెట్టాం. రుణాల రికవరీ లక్ష్యం మేరకు సాగితేనే బ్యాంకు అభివృద్ధికి దోహదపడుతుంది. ఆ దిశగా అంతా సమన్వయంతో పని చేస్తున్నాం. దీనిపై మహాజన సభలో సభ్యులందరి ఆమోదంతో 2024-25 వార్షిక బడ్జెట్‌కు అనుగుణంగా కార్యకలాపాలు కొనసాగిస్తాం

– డి.వి.ఎస్.వర్మ, సీఈవో, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే రోడ్లు బాగుపడ్డాయి


సింహాద్రిపురం-లక్కవరం రోడ్డును ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ


కొత్తగా వేసిన రోడ్డుపై మోటారు సైకిల్‌ను నడుపుతూ వెళ్తున్న విప్ కరణం ధర్మశ్రీ

- సింహాద్రిపురం రోడ్డును ప్రారంభించిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: రహదారులన్నీ బాగు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలో లక్కవరం జంక్షన్ నుంచి సింహాద్రిపురం వరకూ రూ. 60 లక్షలతో నూతనంగా నిర్మించిన తారురోడ్డును ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ రోడ్డు గత టీడీపీ హయాంలో బాగుచేయకపోవడంతో పెద్ద గోతులతో ప్రమాదకరంగా ఉండేది. ఇప్పుడు రూ. 60 లక్షలతో కొత్తగా రోడ్డు నిర్మించారు. దీంతో ఇప్పుడు రహదారిలో ప్రయాణం సుగమంగా మారింది. ప్రారంభించిన రోడ్డుపై ఎమ్మెల్యే ధర్మశ్రీ మోటారు సైకిల్ నడుపుతూ సింహాద్రిపురం నుంచి లక్కవరం వరకూ వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పెద్దపెద్ద గోతులతో ఉన్న రోడ్లను కనీసం బాగు చేయించలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక నియోజకవర్గంలో అన్ని రోడ్లను బాగుచేసి కొత్తగా నిర్మించామన్నారు. అంతర్గత మండల, పక్క నియోజకవర్గాలను కలుపుతూ ఉన్న రోడ్లతోపాటు, గ్రామాలను అనుసంధానం చేసే రోడ్లన్నీ పూర్తిస్థాయిలో కొత్తగా వేశామన్నారు. త్వరలోనే బీఎన్‌రోడ్డు పనులు చేపట్టి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. సంక్షేమ పథకాలు ప్రజలకు అమలు చేయడంతోపాటు గ్రామ స్వరాజ్య స్థాపనకు గ్రామాల అభివృద్ధి కోసం అన్నివిధాలుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు పూర్తిగా మద్దతు తెలపాలని కోరారు. లక్కవరం సర్పంచ్ శీరంరెడ్డి వెంకటరమణ, సింహాద్రిపురం సర్పంచ్ దంతులూరి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం సందడిగా జరిగింది. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, ఎంపీటీసీ మట్టా రాజునాయుడు, ఆకిరి లక్ష్మి, ఉప సర్పంచ్ బంగారునాయుడు, వైస్ ఎంపీపీ బుద్ధ గంగరాజు, బైన ఈశ్వరరావు, పార్టీ మండలాధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, శానాపతి శ్రీనివాసరావు, మండల సచివాలయాల కన్వీనర్ పతివాడ అప్పారావు, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

కమనీయంగా సూర్యనారాయణస్వామి కల్యాణం


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


సారె ఊరేగింపులో మహిళా భక్తులు

అనకాపల్లి : జీవీఎంసీ విలీన గ్రామమైన రాజుపాలెం సూర్యనారాయణ స్వామి ఆలయంలో బుధవారం ఉదయం ఉషా పద్మిని ఛాయ సమేత సూర్యనారాయణస్వామి కల్యాణం కమనీయంగా జరిగింది. క్యూ కాంప్లెక్స్ దాత నాయుడు, పీవీ రమణ దంపతులచే ఆలయ అర్చకుడు దొడ్డిపట్ల కల్యాణ్‌కుమార్ వేడుకలు నిర్వహించారు. స్వామివారి కల్యాణం తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు పరిసర ప్రాంతాల నుంచి తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొణతాల బాబూరావు, వైస్ చైర్మన్ కర్రి కోటేశ్వరరావు, కార్యదర్శి గొల్లవిల్లి కోటేశ్వరరావు, కోశాధికారి గొల్లవిల్లి రామకృష్ణ ప్రసాద్, పాలకవర్గ సభ్యులు జి. నర్సింగరావు, బండారు వెంకటరమణ, రమణ, ఆదిబాబు, చిరంజీవి, రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సారె ఊరేగింపు..

స్వామి, అమ్మవార్ల సారె ఊరేగింపు సాయంత్రం నేత్రపర్వంగా సాగింది. రాజుపాలెం గ్రామ పరిసర ప్రాంతాల నుంచి మహిళలు జంతికలు, రవ్వ లడ్డూలు, లడ్డూలు, కాజా, అరిసెలు, సున్నుపాకుండలు, తీపిబూందీ, గవ్వలు, జిలేబీ, కోవాతో పాటు పసుపు, కుంకుమ, అరటి పళ్లు, యాపిల్ పళ్లతో ఆలయానికి వచ్చారు. ఆలయం నుంచి సాగిన ఊరేగింపు వీధుల గుండా సాగి తిరిగి ఆలయానికి చేరుకుంది. తినుబండారాలను స్వామి అమ్మవార్లకు నివేదించి అనంతరం భక్తులకు పంపిణీ చేశారు.

పశువుల కంటైనర్ లారీ పట్టివేత


లారీలో తరలిస్తున్న ఆవులు

ఎస్.రాయవరం: మండలంలో గెడ్డపాలెం జాతీయ రహదారిపై కంటైనర్ లారీలో అక్రమంగా తరలిస్తున్న ఆవులను గోరక్షణ చారిటబుల్ సభ్యులు పట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట నుంచి విజయవాడ జిల్లాకు తరలిస్తున్న ఆవులను లారీతో పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వీటిని తరలిస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్.రాయవరం ఎస్‌ఐ విభీషణరావు తెలిపారు. పట్టుబడిన ఆవులను సబ్బవరం గోశాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ప్రతిభ

- 98.281 పాయింట్స్ సాధించిన తేజేష్



కె.కోటపాడు: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో మండలంలోని కొరువాడ గ్రామానికి చెందిన కొరువాడ తేజేష్ 100 మార్కులకు గాను 98.2811924 పర్సంటైల్ స్కోర్(ఎన్‌టీఏ) సాధించాడు. సాధారణ మధ్య తరగతికి చెందిన గోవిందరావు, లోవమణిల కుమారుడు తేజేష్ చిన్నప్పటి నుంచి చదువుల్లో చురుగ్గా ఉంటూ మంచి మార్కులు సాధించేవాడు. గత నెల 29న జేఈఈ మెయిన్స్ పరీక్షలు రాశాడు. ఈ నెల 12 విడుదలైన ఈ ఫలితాల్లో మంచి పర్సంటైల్ స్కోర్‌ను సాధించి అధ్యాపకులు, గ్రామస్తుల నుంచి అభినందనలు అందుకున్నాడు.

పోలీసులమంటూ బెదిరించి దారి దోపిడీ

- నలుగురికి రిమాండ్
- నిందితుల్లో ఇద్దరు యూట్యూబ్ చానల్ విలేకరులు

చోడవరం రూరల్: దారి కాచి పోలీసులమంటూ బెదిరించి, చేయిచేసుకుని పెద్ద ఎత్తున నగదును, స్కూటీని తస్కరించిన నలుగురికి 14 రోజుల రిమాండ్ (జ్యుడిషియల్ కస్టడీ)కు తరలించినట్టు చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు బుధవారం రాత్రి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మండలంలోని గాంధీ గ్రామానికి చెందిన ఫిర్యాదీ ఆలకుంట సాయిలు అతని అల్లుడు ఆకుల శ్రీను వేర్వేరుగా రెండు ద్విచక్ర వాహనాలపై గత నెల 27 ఉదయం 5.30 గంటల సమయంలో చోడవరం-చీడికాడ రోడ్డులో వెళ్తున్నారు. ఇదే క్రమంలో నిందితులు చోడవరం పట్టణం ఎడ్లవీధికి చెందిన ఆర్‌ఎస్9 యూట్యూబ్ చానల్ విలేకరి కేతవరపు బెన్నిబాబు (33), అదే చానల్ మరో విలేకరి బుచ్చియ్యపేట మండలం వడ్డాది గ్రామం శివాలయం వీధికి చెందిన వీర్ల నారాయణమూర్తి అలియాస్ నానాజీ (46), చోడవరం పట్టణం ఎడ్లవీధికి చెందిన తమటపు వెంకట శివప్రసాద్ (38), డెల్లి అప్పారావు (54) జగనన్న కాలనీ సమీపంలో సాయి, శ్రీనులను ఆపి తాము పోలీసులమని వారిపై జులుం ప్రదర్శించారు. వారిద్దరిపైనా చేయి చేసుకోవడమే గాకుండా బండి డిక్కీలో రూ.1.45 లక్షలను, స్కూటీని లాక్కున్నారు. అంతటితో ఆగకుండా వారి నుంచి మొబైల్ నంబర్ తీసుకుని, తదుపరి ఫిర్యాదీ సాయిలుకు ఫోన్ చేసి మరో రూ.4 లక్షలు ఇవ్వాలని, లేనట్లయితే కుటుంబాన్ని హతమారుస్తామంటూ బెదిరింపులకు దిగారు. దీంతో బాధితుడు చోడవరం పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులు నుంచి అపహరించిన సొమ్ములో రూ.1,19 లక్షలను, స్కూటీని స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. చోడవరం మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా ఈ నెల 28వ తేదీ వరకు రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు. దీంతో నిందితులు నలుగురిని విశాఖలోని సెంట్రల్ జైలుకు తరలించామన్నారు.

తహసీల్దార్ హత్య కేసు విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు

- కలెక్టర్, సీపీకి ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ వినతి
- తక్షణ సహాయంగా రమణయ్య కుటుంబానికి రూ.2 లక్షల అందజేత

మహారాణిపేట: విశాఖ రూరల్ తహసీల్దార్ సనపల రమణయ్య హత్య కేసు విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, నగర పోలీసు కమిషనర్ ఎ.రవిశంకర్‌ను కలిసి పలు అంశాలపై వినతి పత్రాలు సమర్పించారు. తహశీల్దార్ రమణయ్య కుటుంబ సభ్యులకు తక్షణ సహాయం కింద రూ.2 లక్షల చెక్కును వెంకటేశ్వర్లు అందజేశారు.

రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియాపై హర్షం

రమణయ్య కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఒకరికి ఉద్యోగం ప్రకటించిన ప్రభుత్వానికి వెంకటేశ్వర్లు ధన్యవాదాలు తెలిపారు. భూఆక్రమణలు, దీర్ఘకాలిక భూతగదాల కేసుల పరిష్కారానికి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ అమరావతి జేఏసీ జిల్లా అధ్యక్షుడు సత్తి నాగేశ్వరరెడ్డి, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎ.త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.

ఈకోర్సా,కావలీర్స్ విజయం

విశాఖ స్పోర్ట్స్: యూసీసీ టీ20 క్రికెట్ టోర్నిలో ఈకోర్సా, కావలీర్స్,గెలాక్సీ జట్లు శుభారంభం చేశాయి. రైల్వే స్టేడియంలో తొలుత బ్యాటింగ్ చేసిన పోలీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 121 పరుగులు చేసింది. ప్రతిగా ఈకోర్సా మరో బంతి మిగిలి ఉండగానే తొమ్మిది వికెట్లకు 122 పరుగులతో విజయాన్నందుకుంది. శేష ఐదు వికెట్లు తీశాడు. వైఎస్సార్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కావలీర్స్ ఐదు వికెట్లు కోల్పోయి 262పరుగులు చేసింది. రోహిత్ 139 పరుగులు చేశాడు. ప్రతిగా సైమండ్ బ్లూస్ తొమ్మిది వికెట్లు కోల్పోయి 136 పరుగులే చేసింది. మరో మ్యాచ్‌లో గాజువాక గ్రీన్స్ 89 పరుగులకు ఆలౌట్ కాగా గెలాక్సీ జట్టు 9.5 ఓవర్లలోనే విజయలక్ష్యాన్నందుకుంది. రైల్వే స్టేడియంలో జరిగిన పోటీల ప్రారంభ కార్యక్రమంలో ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్‌ఆర్ గోపినాథ్‌రెడ్డి, ఈకోర్సా జాయింట్ స్పోర్ట్స్ అధికారి బి.అవినాష్ , రంజీ ఆల్‌రౌండర్ శశికాంత్, యూసీసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అమరావతి తరలివెళ్లిన పేట నేతలు

- రాజ్యసభకు బాబూరావు నామినేషన్ దాఖలు
- జగనన్న, పేట ప్రజల రుణం తీర్చుకోలేనిది : ఎమ్మెల్యే బాబూరావు


ఎమ్మెల్యే బాబూరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే జోగులు, చిక్కాల రామారావు తదితరులు

నక్కపల్లి: రాజ్యసభ సభ్యునిగా పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు నామినేషన్ దాఖలు కార్యక్రమానికి పాయకరావుపేట నియోజకవర్గం నుంచి పలువురు ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు అమరావతి తరలివెళ్లారు. రాష్ట్రం నుంచి ఖాళీ అవుతున్న మూడు రాజ్యసభ స్థానాల్లో ఆయనతోపాటు ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి, మేడా రవీంద్రరెడ్డికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేటాయించిన విషయం తెలిసిందే. ఈ మేరకు గొల్ల బాబూరావు బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి పాయకరావుపేట, నక్కపల్లి మండలాల నుంచి నియోజకవర్గ సమన్వయ కర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ చిక్కాల రామారావు, ఎంపీపీ ఇసరపు పార్వతి తాతారావు, జెడ్పీటీసీ సభ్యుడు లంక సూరిబాబు, జిల్లా పబ్లిక్ విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ సూరాకాసుల గోవిందు, సింహాచలం దేవస్థానం బోర్డు ఆహ్వానితురాలు శేషారత్నం, సర్పంచ్‌లు పన్నీరు బాబ్జి, ఎంపీటీసీలు పల్యాల లచ్చబాబు, ముసలయ్య, పోలిశెట్టి ఈశ్వరరావు, అద్దేపల్లి నూకినాయుడు, కొప్పిశెట్టి మోహన్, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ కొంకిపూడి రామకృష్ణశ్రీప్రతిరాజు, గొర్ల బాబూరావు, రాజారమేష్, శ్రీదేవి, పాండు తదితరులు అమరావతి తరలివెళ్లి అభినందించారు. వైఎస్ కుటుంబానికి విశ్వాసపాత్రుడిగా ఉన్న బాబూరావును పెద్దల సభకు పంపించడం ద్వారా జగనన్న పాయకరావుపేట నియోజకవర్గానికి దేశస్థాయిలో మంచి గుర్తింపు ఇచ్చారన్నారు. బాబూరావు మాట్లాడుతూ పేట నియోజకవర్గ ప్రజల ఆశీస్సులు జగనన్న అండదండలే తనను పెద్దల సభకు పంపించాయన్నారు. వీరిద్దరి రుణం తీర్చుకోలేనిదన్నారు. కొన ఊపిరి ఉన్నంత వరకు వైఎస్సార్‌సీపీ అభ్యున్నతికి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

హైవేపై ప్రమాదాలకు చెక్

- 6 బ్లాక్ స్పాట్లు, 30 ఆక్సిడెంట్ స్పాట్లు గుర్తింపు
- అన్నవరం నుంచి అనకాపల్లి వరకు 277 సోలార్ లైట్లు
- 89 కిలోమీటర్ల మేర వెలుగులు


బయ్యవరం వద్ద రోడ్డు మధ్యలో స్తంభాల కోసం గోతులు తీస్తున్న కార్మికులు


ధర్మవరం వద్ద స్తంభాలు ఏర్పాటు పనులు చేస్తున్న కార్మికులు

నక్కపల్లి: ప్రయాణికులకు మెరుగైన ప్రయాణం, రవాణా లక్ష్యంగా నేషనల్ హైవే అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. అయినప్పటికీ నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయిలో ప్రమాదాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ఎప్పటికప్పుడు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. తాజాగా హైవేలో రాత్రిళ్లు తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్న ప్రాంతాలను మొత్తం ఆరు బ్లాక్ స్పాట్లు, 30 యాక్సిడెంట్ స్పాట్లుగా గుర్తించారు. మొత్తం 36 ప్రధాన కూడళ్లలో 4,800 మీటర్ల దూరం కవర్ చేస్తూ ఈ ప్రాంతాల్లో 277 సోలార్ లైట్లు ఏర్పాటు చేయనున్నారు.

ప్రధానంగా అన్నవరం సెక్షన్‌లో అనకాపల్లి నుంచి కాకినాడ జిల్లా అన్నవరం వరకు జాతీయ రహదారి-16పై కిలోమీటరు 741+225 నుంచి కిలోమీటరు 830+525 వరకు 89 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. బ్లాక్ స్పాట్లు(ఎక్కువ ప్రమాదాలు), యాక్సిడెంట్ స్పాట్లు(అరకొరగా ప్రమాదాలు)గా గుర్తించిన 36 ప్రధాన కూడళ్లలో రాత్రిళ్లు సరైన లైటింగ్ సదుపాయం లేకపోవడం వల్లే తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీనిపై రాష్ట్ర పోలీసు శాఖ వారు, జిల్లా రహదారి భద్రతా విభాగ కమిటీ వారు నివేదిక సమర్పించారు. ఈ కూడళ్లు, బ్లాక్ స్పాట్స్ వద్ద లైటింగ్ సదుపాయం కల్పిస్తే రోడ్డు ప్రమాదాలను కొంతవరకు నివారించవచ్చని సూచించడంతో నేషనల్ హైవే అధికారులు ఈ ప్రాంతాల్లో సోలార్ లైట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. రోడ్డుకు మధ్యలో డబుల్ ఆరమ్ కలిగిన స్తంభాలు ఏర్పాటు చేసిన సోలార్ ల్యాంపులు బిగించే పనులు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. బయ్యవరం, పెనుగొల్లు ధర్మవరం వద్ద స్తంభాలను ఏర్పాటు చేసేందుకు డివైడర్ మధ్యలో గోతులు తీసే పనులను కార్మికులు చేపట్టారు.

బ్లాక్ స్పాట్లు..

2015-18 సంవత్సరంలో అత్యధిక ప్రమాదాలు చోటు చేసుకుంటున్న అన్నవరం వద్ద మండపం జంక్షన్‌లో(11 స్తంభాలు), కోంకోటలో(11), పిసినికాడలో(11), పోతిరెడ్డి పాలెం జంక్షన్‌లో(4), మర్రిబంద జంక్షన్‌లో (11), కొక్కిరాపల్లి జంక్షన్‌లో (4) బ్లాక్‌స్పాట్లుగా గుర్తించారు.

యాక్సిడెంట్ స్పాట్లు..

కాకినాడ జిల్లా అన్నవరం ఆర్చి దగ్గర (6 స్తంభాలు), తేటగుంట - తిమ్మాపురం జంక్షన్‌లో (6), రాజుల కొత్తూరు జంక్షన్‌లో(6), తుని సమీపంలో తలుపులమ్మలోవ - ముగ్గుకొండ సెంటర్‌లో(6), పాయకరావుపేట మండలం పి.ఎల్.పురం జంక్షన్‌లో(6), సీతారామపురం జంక్షన్‌లో(6), నక్కపల్లి మండలం ఒడ్డిమెట్ట జంక్షన్‌లో(6), గొడిచర్ల జంక్షన్‌లో(6), వేంపాడు జంక్షన్‌లో(14), కాగిత జంక్షన్‌లో (6), నక్కపల్లి జంక్షన్‌లో 22, ఉపమాక రోడ్డు జంక్షన్‌లో (14), టోల్ ప్లాజా వద్ద (9), నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం జంక్షన్‌లో (6), గోకులపాడు జంక్షన్‌లో(6), పెనుగొల్లు జంక్షన్‌లో(6), ధర్మవరం జంక్షన్‌లో (6), యలమంచిలి వద్ద (6), అచ్యుతాపురం జంక్షన్‌లో (4), నూతనగుంటపాలెంలో (11), నర్సింగపల్లిలో (14), గొబ్బూరు జంక్షన్‌లో (6), పరవాడ పాలెంలో(6), జమాదులపాలెంలో(6), హెరిటేజ్ కంపెనీ వద్ద (6), బయ్యవరంలో (6), ఉమ్మలాడ జంక్షన్‌లో (6 స్తంభాలు) యాక్సిడెంట్ స్పాట్లు గుర్తించారు. ఆయా చోట్ల డబుల్ ఆరమ్స్ (రెండువైపులా) స్తంభాలు ఏర్పాటు చేయనున్నారు.

క్లుప్తంగా

రాజశ్యామలాదేవిగా కనకదుర్గమ్మ



అనకాపల్లి : గవరపాలెం శతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయంలో బుధవారం మాఘమాస పంచమిని పురస్కరించుకుని అమ్మ వారికి ప్రధాన అర్చకులు భోగపురపు వెంకటరమణ (బాబు) ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు శ్రీ రాజశ్యామ లాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయా నికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ, చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, నిర్వా హకులు కాండ్రేగుల నాయుడు, పొలిమేర శ్రీను, సభ్యులు పాల్గొన్నారు.

జాతర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న గ్రామ కమిటీ సభ్యులు

అనకాపల్లి : స్థానిక విజయరామరాజుపేట మరిడిమాంబ అమ్మవారి జాతరను ఈ ఏడాది ఘనంగా నిర్వహిస్తున్నట్లు గ్రామ కమిటీ చైర్మన్ ఆళ్ల శివరాం సత్యనారాయణ చెప్పారు. అమ్మవారి ఆలయంలో బుధవారం జాతర పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 22 నుంచి అమ్మవారి జాతరలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నేలవేషాలు, విద్యుత్ సెట్టింగ్‌లు ఏర్పాటు చేశామన్నారు. కోలాటం, చిడతలు, నేలడ్యాన్స్‌లు, అమ్మవారి ఊరేగింపు, ఆర్కెస్ట్రా ఏర్పాటు చేసే దిశగా ఇప్పటికే చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి పలకా రాము, వైస్ చైర్మన్ బొబ్బిలి అప్పారావు, కోశాధికారి పిట్ల బుద్దే శ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



విజేతకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న వెంకటరమణ

అనకాపల్లి : స్థానిక గౌరీ గ్రంథాలయంలో బుధవారం ఆర్ఆర్‌బీ అసిస్టెంట్ లోకో పైలెట్ పోస్టుల మాక్ టెస్ట్ విజేతలకు గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో రాణించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీసీఈ ప్రతినిధులు శ్రీధర్, కె.రమేష్, గ్రంథాలయ మాజీ కార్యదర్శి మళ్ల బాపునాయుడు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 6,776 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,800	4,700
మొదటి రకం	3,500	4,060
రెండో రకం	3,460	3,670
మూడోరకం	3,290	3,450

అనకాపల్లి సినిమాలు

ఈగల్	: రాజా
అంబాజీపేట	
మ్యారేజిబ్యాండు	: సత్యనారాయణస్క్రీన్-1
ఈగల్	: సత్యనారాయణస్క్రీన్-2
యాత్ర-2	: షిర్డిసాయి
లాల్‌సలామ్	: పర్తిసాయి
ఓయ్	: వెంకటేశ్వర
నా సామిరంగ	: శ్రీసత్య
హనుమాన్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 15 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-6 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు, ఎ నెగెటివ్-1 యూనిట్, ఓ నెగెటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 393 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 353 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

ఆల్ క్లియర్



జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన బోర్డు

- సత్ఫలితాలిస్తోన్న అధికారుల చర్యలు
- షాపింగ్ మాల్స్ సెల్లార్లలో వాహనాల పార్కింగ్‌తో సమస్యకు చెక్
- నచ్చిన చోట వాహనాలు ఆపకుండా నో పార్కింగ్ బోర్డులు

అభివృద్ధి వైపు శరవేగంగా దూసుకుపోతున్న అనకాపల్లి పట్టణం గత కొంత కాలంగా తీవ్రమైన ట్రాఫిక్ సమస్యతో కొట్టుమిట్టాడేది. వాహన చోదకులు తమకు నచ్చిన చోట వాహనాలు ఆపేసి తోచిన చోటుకు వెళ్తుండేవారు. దీంతో రోడ్లు వాహనాలతో కిక్కిరిసిపోయేవి. అలాగే ఇరుకు రోడ్ల వల్ల కూడా ట్రాఫిక్ సమస్యలు తలెత్తేది. ఇది గమనించిన ట్రాఫిక్ విభాగం అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రధాన రహదారుల్లోని షాపింగ్ మాల్స్ కచ్చితంగా సెల్లార్లు నిర్మించేలా చర్యలు తీసుకుని.. అక్కడ వినియోగదారుల వాహనాలు పార్కింగ్ చేసేలా ఆదేశాలు జారీ చేశారు. ఇది చక్కటి ఫలితం ఇచ్చింది. చాలా వరకు వాహనాలు షాపింగ్ మాల్స్ సెల్లార్లలో పార్కింగ్ చేస్తుండడంతో హైవే.. ప్రధాన రహదారిపై అడ్డదిడ్డంగా వాహనాలు పార్కింగ్ చేసే విధానాన్ని వాహన చోదకులు వదులుకున్నారు. అలాగే జీవీఎంసీ ఇరుకు రోడ్లను విస్తరించడం వల్ల ట్రాఫిక్ సమస్య పరిష్కారం అయింది. దీంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అనకాపల్లి : పట్టణ పరిధిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. రెండేళ్ల క్రితం అనకాపల్లి కేంద్రంగా జిల్లా ఆవిర్భావంతో ట్రాఫిక్ సమస్య అధికమైంది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపారాల నిమిత్తం వచ్చే వాహన చోదకులు తమ వాహనాలను రహదారులపై నిలపకుండా పట్టణంలో ఉన్న షాపింగ్‌మాల్స్ సెల్లార్లలో నిలిపేలా ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపడుతున్నారు. విశాఖకు దీటుగా పట్టణం అభివృద్ధిలో దూసుకుపోతోంది. దీంట్లో భాగంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో రహదారుల విస్తరణ చేపడుతున్నారు. ప్రధాన రహదారులైన పెరుగుబజారు కూడలి నుంచి రైల్వేస్టేషన్ గాంధీబొమ్మ జంక్షన్ వరకు సుమారు కిలోమీటర్ల పొడవున రహదారి విస్తరణ చురుగ్గా సాగుతోంది. జాతీయ రహదారి తోటాడ కూడలి నుంచి నూకాంబిక ఆలయ రహదారిని పూల్‌బాగ్ రహదారికి అనుసంధానం చేస్తూ విస్తరిస్తున్నారు. వేల్పులవీధి ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న బ్రిడ్జి వద్ద డ్రైనేజీ వెడల్పు చేస్తూ నిర్మించేందుకు జీవీఎంసీ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. పట్టణంలోకి ప్రవేశించి ప్రధాన రహదారులైన శారదా నది బ్రిడ్జి నుంచి సుంకరమెట్ట జంక్షన్‌కు సుమారు 4 కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడకుండా జీబ్రా లైన్లు, పెద్దపెద్ద బోర్డులతో పాటు నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేస్తూ ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్ పెడుతున్నారు. పూడిమడక జాతీయ రహదారి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా గుండాల జంక్షన్ వరకు ఇప్పటికే రహదారికి ఇరువైపులా ట్రాఫిక్ పోలీసులు పార్కింగ్ సౌకర్యం కల్పించారు. దీంతో వాహన చోదకులు తమ వాహనాలకు రక్షణతో పాటు కేసుల నమోదు బాధ తగ్గిందంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



నెహ్రూచౌక్ వద్ద ఏర్పాటైన నో పార్కింగ్ బోర్డు

మంచి రోజులొచ్చాయి..



పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గాయి. జిల్లా కేంద్రంగా ఆవిర్భావంతో మరింత ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందనుకున్నా. ట్రాఫిక్ పోలీసులతో పాటు జీవీఎంసీ అధికారులు రహదారుల విస్తరణ, నో పార్కింగ్ బోర్డుల ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్య తగ్గుముఖం పట్టింది. ఇప్పుడు పట్టణానికి మంచి రోజులు వచ్చాయి.

– వాకాడ ప్రసాద్, అనకాపల్లి

ట్రాఫిక్ ఇబ్బందులు తప్పాయి...



గతంలో ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న షాపింగ్ మాల్స్‌తో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడేది. ఇటీవల ట్రాఫిక్ పోలీసులు షాపింగ్ మాల్స్ వద్ద నిలిపే వాహనాలపై కేసులు రాస్తుండడంతో రహదారిపై వాహనాల పార్కింగ్ తగ్గింది. జీవీఎంసీ అధికారులు కూడా షాపింగ్‌మాల్స్ దిగువన సెల్లార్ల నిర్మాణం చేపట్టడంతో మంచి ఫలితం కనిపిస్తోంది.

– పి.సోమేష్, అనకాపల్లి

ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా చర్యలు..



పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడకూడదని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పలుచోట్ల ఇప్పటికే నో పార్కింగ్ బోర్డులు, రహదారిపై జీబ్రా మార్కింగ్ ఏర్పాటు చేశాం. అయినప్పటికీ ఎవరైనా రహదారిపై వాహనాలు నిలిపితే అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తున్నాం.

– పైడపునాయుడు, ట్రాఫిక్ సీఐ

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పని చేయాలి



భరత్‌కుమార్‌ను సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

కశింకోట : వైఎస్సార్‌సీపీ విజయమే ఏకైక లక్ష్యంగా శ్రేణులు కష్టపడి పని చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కోరారు. మండలంలోని బయ్యవరం, అచ్చెర్ల, వెదురుపర్తి సచివాలయాలను బుధవారం సందర్శించి పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు, మహిళలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవ రత్నాలు, ఇతర సంక్షేమ పథకాల గురించి ప్రజలకు సమగ్రంగా వివరించి పార్టీ మరింత బలోపేతం కావడానికి దోహదపడాలన్నారు. అర్హులుంటే ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి త్వరితగతిన అందేలా వలంటీర్లు దోహదపడాలన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, సర్పంచ్‌లు నిమ్మదల సోమేష్, అరుణ, గొల్లవిల్లి జయ, ఎంపీటీసీ సభ్యుడు గొన్నా నాగ సత్యనారాయణ, మాజీ సభ్యుడు మిస్కా రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల ప్రతిభకు అభినందనలు



విద్యార్థినులు తయారు చేసిన ప్రాజెక్టు



విద్యార్థినులను అభినందిస్తున్న పూర్ణప్రియ, శేషగిరిరావు

అనకాపల్లి : సిగ్నల్ వ్యవస్థ ద్వారా ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టవచ్చంటూ స్థానిక డైట్ కళాశాల విద్యార్థినులు ప్రాజెక్టు రూపొందించారు. బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని చల్లా లక్ష్మీ ఐశ్వర్య, సీఎస్‌డీ విద్యనభ్యసిస్తున్న పీవీకే ఉమా సుప్రజ సిగ్నల్ పడే ముందు దీనికి అమర్చిన బ్లింకింగ్ లైట్ల ద్వారా వాహన చోదకులు సులువుగా ప్రయాణం సాగించేలా ఈ పరికరాన్ని రూపొందించారు. ప్రమాదాల నివారణకు ఉపకరించే ఈ పరికరాన్ని రూపొందించిన ఇద్దరు విద్యార్థినులను ప్రాజెక్టు ఇంజినీర్ భమిడిపాటి శేషగిరిరావు, సీఈసీ విభాగాధిపతి డాక్టర్ పి.పూర్ణప్రియ, కళాశాల యాజమాన్యం కళాశాల ఆవరణలో బుధవారం అభినందించారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్‌ఐ రమణి



జాతీయ రహదారిపై మానవహారం

కశింకోట : మహిళల రక్షణ కోసం దిశ వంటి పలు చట్టాలున్నాయని, వాటి గురించి స్వయం సహాయక సంఘాలకు అవగాహన కలిగించాలని ఏఎస్‌ఐ కె. రమణి కోరారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం వెలుగు వీవోఏలు, స్వయం సహాయక సంఘాల మహిళలతో నిర్వహించిన సమావేశంలో దిశ చట్టాలు, రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలు పాటించేలా చైతన్య పరచాలన్నారు. అనంతరం రహదారి భద్రతపై మహిళలు, యువకులు, వెలుగు సిబ్బంది అవగాహన కలిగిస్తూ ర్యాలీ, మానవ హారం నిర్వహించారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, నాలుగు చక్రాల వాహనదారులు తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలని, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయరాదని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని నినాదాలు చేశారు. వెలుగు ఏపీఎం ఎస్. శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కరాటే పోటీలో ఓవరాల్ చాంపియన్‌షిప్



ఉపాధ్యాయులతో కరాటే పోటీల్లో రాణించిన విద్యార్థులు

కశింకోట : జిల్లా స్థాయి కరాటే పోటీలో స్థానిక సెయింట్ జాన్స్ స్కూలు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించింది. విశాఖలో ఇటీవల జరిగిన పోటీలో 5 స్వర్ణ, 2 వెండి, 3 కాంస్య పతకాలు కైవసం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ రూపనంది, అకడమిక్ ఇన్‌చార్జి సీహెచ్ చంద్రమౌళి బుధవారం తెలిపారు. తద్వారా ఓవరాల్ ఛాంపియన్‌షిప్ లభించిందని, దీన్ని సాధించిన విద్యార్థులు, కోచ్ సీహెచ్ సూరిఅప్పారావును అభినందించారు.

వేడుకగా గౌరీ పరమేశ్వరుల ఊరేగింపు



గౌరీపరమేశ్వరులను ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు

గొలుగొండ: చీడిగుమ్మలలో గౌరీపరమేశ్వరుల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఇక్కడ గౌరీపరమేశ్వరుల విగ్రహాలను ఊరేగించి సారె సమర్పించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కమిటీ సభ్యులు, మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్నబ్బాయి, ఎంపీటీసీ అప్పలనాయుడు, చీడిగుమ్మల సహకార బ్యాంక్ చైర్మన్ రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరుల అనుపోత్సవం

రోలుగుంట: కొమరవోలులో గౌరీపరమేశ్వరుల అనుపోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక రామాలయం వద్ద ఉత్సవ స్థలంలో ఉత్సవమూర్తులను ఉంచారు. భక్తులు దర్శించుకున్నారు. సర్పంచ్ గొర్లె రమణమ్మ, ఉప సర్పంచ్ బోశం వెంకటలక్ష్మి దంపతులు, ఎంపీటీసీ గొర్లె వెంకటరామన్ ప్రత్యేక పూజలు చేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ గొర్లె చెల్లంనాయుడు ఆధ్వర్యంలో మహిళలు చీర, సారెతో ఉత్సవమూర్తులను సాగనంపి స్థానిక సూరమ్మ చెరువులో నిమజ్జనం చేశారు.

ఉత్సాహంగా బాలచెంచమ్మ తల్లి తీర్థం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రావికమతం: ప్రసిద్ధ చెందిన గర్నికం బాలచెంచమ్మతల్లి తీర్థం బుధవారం ఘనంగా జరిగింది. ముందెన్నడూ లేని విధంగా ఈసారి వేలాదిగా భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా అమ్మవారిని ఈ ప్రాంతీయులు కొలుస్తుంటారు. వేకువ జాము నుంచీ ఆలయం నుంచి మెయిన్ రోడ్డు వరకూ అర కిలోమీటర్ మేర బారులు తీరారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన చీరెలు, కొబ్బరికాయలు, అరటిగెలలు, చెరకు, ధాన్యం మూటలు, బెల్లపు దిమ్మెలు మొక్కుగా చెల్లించుకున్నారు. రావికమతం, కొత్తకోట ఎస్ఐలు, సిబ్బందితోపాటు ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వలంటీర్లు బందోబస్తు నిర్వహించారు. తీర్థంలో ఏర్పాటు చేసిన భారీ లైటింగ్ ఎంతగానో ఆకట్టుకుంది. భారీ జెయింట్ వీల్, రైలు మార్గం, సర్కస్ వంటివి పిల్లలకు మంచి వినోదాన్ని పంచాయి. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ముంగిళ్లలోనే మెరుగైన వైద్యం

- ఉడ్‌పేట ప్రాథమిక పాఠశాలలో జగనన్న సురక్ష
- 350 మందికి ఉచిత పరీక్షలు, వైద్య సేవలు, మందుల అందజేత



ఉడ్‌పేట ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మందులను పరిశీలిస్తున్న ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి

తుమ్మపాల : ప్రతి పేద కుటుంబంలో నాణ్యమైన, అత్యున్నత స్థాయి వైద్య సేవలను ఇంటి వద్దే అందించాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి అన్నారు. 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకి రామరాజు ఆధ్వర్యంలో పట్టణంలోని సచివాలయం-4 పరిధి ఉడ్‌పేట ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యం అందరికీ అందుబాటులో ఉన్నప్పుడే ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ప్రజల గుండెల్లో నిలిచిపోయిన మహానేత వైఎస్సార్ అన్నారు. ఆయన బాటలోనే సీఎం జగన్ వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికి రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఒక్కో కళాశాలకు రూ.500 కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. ఉత్తరాంధ్రలో అద్భుతమైన సేవలు అందించే విధంగా కేజీహెచ్‌ను అభివృద్ధి చేశారన్నారు. ఉద్దానంలో కిడ్నీ సమస్యల శాశ్వత పరిష్కారం దిశగా సురక్షితమైన మంచినీటి ప్లాంట్ నిర్మాణం, ఆరోగ్యశ్రీని రూ.25 లక్షల వరకు పరిమితి పెంచి దాదాపు వెయ్యి రకాల రోగాలకు ఉచితంగా వైద్యం అందించే సౌలభ్యం కల్పించారన్నారు. మండలంలో సుందరయ్యపేటలో 11 ఎకరాల విస్తీర్ణంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఈ ఏడాది నుంచి అడ్మిషన్లు జరుగుతాయని, పట్టణంలో ఉడ్‌పేట ప్రాథమిక పాఠశాల వేదిక కానుందన్నారు. శాంతి పార్కు అభివృద్ధికి రూ.50 లక్షలు వెచ్చించినట్లు తెలిపారు. క్రీడల శాఖ జిల్లా కార్యాలయానికి రూ.70 లక్షలు మంజూరు చేశామన్నారు. మరింత అభివృద్ధికి మరో రూ.25 లక్షలు సీఎస్సార్ నిధులు వెచ్చిస్తామన్నారు. భవిష్యత్ తరాల అభివృద్ధి కోసమే నాడు-నేడు, ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మట్టిలో మాణిక్యాలను వెతికితీసి వారిని ప్రోత్సహించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వైద్య వ్యవస్థలో మునుపెన్నడూ లేని అభివృద్ధి ప్రతిపక్షాలకు కనబడనట్లు నటిస్తున్నారని, వారి మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. మళ్ళీ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు అందరం కృషి చేయాలన్నారు. అంతకు ముందు వైద్యశిబిరంలో వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు చేసి మందులు అందించారు. కార్పొరేటర్ సునీత మాట్లాడుతూ అన్ని సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలంటే ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఎన్నుకోవాలన్నారు. మొత్తం 350 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు డాక్టర్ నీరజ తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ కాండ్రేగుల విష్ణుమూర్తి, పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ, డాక్టర్ లక్ష్మీనారాయణ, వైద్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతీపూజ



డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో సరస్వతీ పూజ చేస్తున్న ఉపాధ్యాయులు

కశింకోట : స్థానిక డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం శ్రీ పంచమి నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని సరస్వతీదేవి విగ్రహానికి పూజలు చేశారు. హెచ్ఎం ఎంఆర్‌వీ అప్పారావు మాట్లాడుతూ ఈ ఏడాది టెన్త్ విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు మంచి పేరు తేవాలని కోరారు. ఉపాధ్యాయులు రామారావు, చంద్రశేఖర్, రంగలక్ష్మి, శేషుకుమారి, నీలవేణి, సత్యవతి, అప్పారావు, పూర్వ విద్యార్థి గుళ్లపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నూతన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

కశింకోట : నూతన ఆరోగ్యశ్రీ కార్డుల ద్వారా వైద్య సేవలు పొందే పరిమితిని రూ.25 లక్షలకు పెంపుదల చేశారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు కోరారు. కశింకోట-3వ సచివాలయం పరిధిలో మంజూరైన సుమారు 11 వందల నూతన ఆరోగ్యశ్రీ కార్డులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఆరోగ్యశ్రీలో వైద్య సేవలకు రూ.5 లక్షల వరకు పరిమితి ఉండేదని, దాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూ.25 లక్షల వరకు పెంచారన్నారు. ఈ మేరకు నూతన ఆరోగ్యశ్రీ కార్డులను మంజూరు చేశారన్నారు. దీనివల్ల ప్రభుత్వ ఆస్పత్రులు, గుర్తింపు కలిగిన ప్రైవేటు కార్పొరేట్ ఆస్పత్రుల్లో అనేక వ్యాధుల నివారణకు వైద్య సేవలు పొందవచ్చన్నారు. పంచాయతీ కార్యదర్శి రమేష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

డైనింగ్ హాలు ప్రారంభం



డైనింగ్ హాలును ప్రారంభిస్తున్న గ్రంథి

అనకాపల్లి : విద్యనభ్యసించిన పాఠశాలకు పూర్వ విద్యార్థి, అమెరికాలో స్థిరపడిన డాక్టర్ ఉమా గ్రంథి తండ్రి వీరన్నచెట్టి జ్ఞాపకార్థం స్థానిక ఏఎంఏఎల్ స్కూల్లో రూ.8 లక్షలతో నిర్మించిన డైనింగ్ హాలును బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకున్న పాఠశాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకుని సేవా కార్యక్రమాలు చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షుడు కొణతాల లక్ష్మీనారాయణ, సంఘ సభ్యులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

దేవరాపల్లి: కాశీపురం రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సీతారాములవారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, ఉగ్రాకుల అప్పారావు, వాలేటి నాగరాజు, బండారు దేముడు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ వితరణ



కంప్యూటర్, ప్రింటర్లను అందజేస్తున్న దాతలు

మాకవరపాలెం: జంగాలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్‌ను దాతలు బుధవారం వితరణగా అందించారు. గ్రామానికి చెందిన సింగంపల్లి సత్యనారాయణ, రాయి అర్జున్ చెరో రూ.20 వేల చొప్పున వెచ్చించి వీటిని సమకూర్చారు. అనంతరం విద్యార్థులతో సామూహిక విద్యాభ్యాసాలు చేయించారు. దాతలను ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు జాన్‌ప్రసాద్, మూర్తి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణంతో ప్రజల్లో భక్తిభావం



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి

నాతవరం: గ్రామాల్లో ఆలయాలు నిర్మించడం వల్ల ప్రజల్లో భక్తిభావం అలవడుతుందని వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి అన్నారు. చమ్మచింతలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ నిర్మాణానికి ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా పలు అభివృద్ధి పనులతోపాటు హిందూ ఆలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఇప్పటికే రూ.10 లక్షలతో ఆంజనేయ స్వామి ఆలయం నిర్మించామన్నారు. పలు ఆలయాలు నిర్మించేందుకు నిధులు కోసం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ప్రతిపాదనలు పంపించారన్నారు. ప్రస్తుతం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణం గ్రామస్తుల విరాళాలతో పనులు ప్రారంభించామన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకు ఎమ్మెల్యే ద్వారా ప్రతిపాదనలు చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెలకాడ కొండబాబు, వైస్ సర్పంచ్ అప్పన దివాణం, నాతవరం పీఏసీఎస్ డైరెక్టరు అప్పన సత్యనారాయణ పాల్గొన్నారు.